## రేషన్ కోసం బారులు



రేషన్ లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం మూడు నెలల రేషన్‌ను ఒకేసారి పంపిణీ చేస్తుండడంతో చౌకధరల దుకాణాల ఎదుట ఉదయం నుంచే బారులు తీరుతున్నారు. ఎండ వేడిమిని తాళలేక అవస్థలు పడుతున్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలోని రేషన్ షాపు ఎదుట బియ్యం తీసుకునేందుకు వచ్చిన మహిళలు, పురుషులను కింది చిత్రంలో చూడొచ్చు. బియ్యాన్ని తీసుకునేందుకు మండే ఎండలోనే క్యూలో నిల్చున్నారు.

# విదేశీ పెట్టుబడులో 7వ స్థానంలో తెలంగాణ

దేశంలోకి గత ఆర్థిక సంవత్సరం 2024- 25లో వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల గణాంకాలు విడుదల చేసింది పరిశ్రమల ప్రోత్సాహక, అంతర్గత వాణిజ్య విభాగం ( డీపీఐఐటీ ). గత ఆర్థిక ఏడాది మొత్తంలో చూసుకుంటే దేశంలోకి వచ్చిన మొత్తం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో 51 శాతం మేర మాహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకే వెళ్లిందని తెలిపింది. ఈ రెండు రాష్ట్రాలు భారీగా ఎఫ్‌డీఐ ఆకర్షించినట్లు డీపీఐఐటీ గణాంకాలు చెబుతున్నాయి. ఇక రెండు తెలుగు రాష్ట్రాలు చూసుకుంటే తెలంగాణ ఏడవ స్థానంలో ఉంది. కానీ, ఆంధ్రప్రదేశ్ టాప్- 10 లోనూ ఉండకపోవడం గమనార్హం.

టాప్- 10 లిస్ట్ ఇదే..

19.6 బిలియన్ డాలర్లు (రూ.1.65 లక్షల కోట్లు)తో మహారాష్ట్ర అగ్రస్థానంలో నిలిచింది.

6.62 బిలియన్ డాలర్లు (రూ. 56 వేల కోట్లు)తో కర్ణాటక రెండో స్థానంలో ఉంది.

6 బిలియన్ డాలర్లు (రూ.51 వేల కోట్లు)తో ఢిల్లీ మూడో స్థానంలో ఉంది.

5.7 బిలియన్ డాలర్లు (రూ.48 వేల కోట్లు)తో గుజరాత్ నాలుగో స్థానాన్ని ఆక్రమించుకుంది.

3.6 బిలియన్ డాలర్లు (రూ.31 వేల కోట్లు)తో తమిళనాడు 5వ స్థానంలో నిలిచింది.

3.1 బిలియన్ డాలర్లు (రూ. 26 వేల కోట్లు)తో హరియాణా 6వ స్థానం ఆక్రమించింది.

3 బిలియన్ డాలర్లు (రూ.25.31 వేల కోట్లు)తో తెలంగాణ 7వ స్థానంలో నిలిచింది.

436 మిలియన్ డాలర్లు (రూ. 3700 కోట్లు)తో ఉత్తర్ ప్రదేశ్ 8వ స్థానంలో నిలిచంది.

374 మిలియన్ డాలర్లు (రూ.3170 కోట్లు)తో రాజస్థాన్ 9వ స్థానంలో ఉంది.

7 మిలియన్ డాలర్లు (రూ. 61 కోట్లు)తో ఝార్ఖండ్ 10వ స్థానంలో నిలిచింది.

వాటాల వారిగా చూసుకుంటే మహారాష్ట్ర 31 శాతం, కర్ణాటక 20 శాతం, గుజరాత్ 16 శాతం, ఢిల్లీ 13 శాతం, తమిళనాడు 5 శాతం, హరియాణా 5 శాతం, తెలంగాణ 4 శాతం, రాజస్థాన్, ఝార్ఖండ్, ఉత్తర్ ప్రదేశ్‌లు 1 శాతం చొప్పున విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అందుకున్నాయి. మరోవైపు.. వివిధ సెక్టార్లకు వచ్చిన పెట్టుబడులను గమనిస్తే సర్వీస్ సెక్టార్ అత్యధికంగా 16 శాతం ఎఫ్‌డీఐని అందుకుంది. ఆ తర్వాత కంప్యూటర్ సాఫ్ట్‌వే హార్డ్ వేర్ సెక్టార్ 15 శాతం, ట్రేడింగ్ 7 శాతం, టెలీకమ్యూనికేషన్ 5 శాతం, ఆటో మొబైల్ ఇండస్ట్రీ 5 శాతం, మౌలిక సదుపాయాల రంగం 5 శాతం, నిర్మాణ రంగం 4 శాతం, కెమికల్స్ సెక్టార్ 3 శాతం చొప్పున ఎఫ్‌డీఐ అందుకున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ ముందంజలో ఉంది. ఇక ఆంధ్రప్రదేశ్ మాత్రం టాప్-10 జాబితాలో చోటు దక్కించుకోలేకపోయింది.



## లేడీ మాఫియా డాన్‌గా

బాలీవుడ్‌లో 'అక్క' అనే వెబ్ సిరీస్‌లో నటిస్తున్నది మహానటి కీర్తి సురేశ్. ఇందులో ఈమె ఓ మాఫియా డాన్‌గా కనిపిస్తుందట. రీసెంట్‌గా ఈ విషయంపై బాలీవుడ్ మీడియా కీర్తి సురేష్‌ని ప్రశ్నించింది. కీర్తి మాట్లాడుతూ 'ఇదొక ఛాలెంజింగ్ రోల్. నటిగా నాకు మాత్రమే ఇలాంటి పాత్రలు దక్కడం అదృష్టం. ఇందులో నా గెటప్, శారీరక భాష పెక్యులర్‌గా ఉంటాయ్.దర్శకుడు ధర్మరాజ్ శెట్టి అద్భుతమైన కాన్సెప్ట్‌తో 'అక్క'ను తీర్చిదిద్దుతున్నారు. కథానుగుణంగా రాధికా ఆప్టే ఈ సిరీస్‌కి కథానాయిక. మరి 'అక్క' ఎవరు? అనే విషయం మాత్రం సస్పెన్స్.' అంటూ అందంగా నవ్వేసింది కీర్తి సురేశ్. ప్రతిష్టాత్మక యష్ రాజ్ ఫిల్మ్స్ పతాకంపై ఈ సిరీస్ రూపొందుతున్నది.



# దేవిక అండ్ డానీ రివ్యూ





ఓటీటీలో కంటెంట్ అంటే విపరీతమైన హింస, అశ్లీలత ఉంటుందని అందరిలోనూ ఓ చిన్న చూపు ఉంటుంది. అయితే ఈ మధ్య తెలుగులోనూ ఓటీటీ కంటెంట్ అంటే అలాంటివే కనిపిస్తున్నాయి. హింస, అక్రమ సంబంధాలు, అశ్లీలత ఎక్కువగానే చూపిస్తున్నారు. అలాంటి టైంలో ఓ క్లీన్ సిరీస్‌ను అందించే ప్రయత్నం చేస్తున్నారు. రీతూ వర్మ ఫీమేల్ లీడ్‌గా 'దేవిక అండ్ డానీ' అనే వెబ్ సిరీస్ రీసెంట్‌గా వచ్చింది. మరి ఈ కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ అయిన దేవిక అండ్ డానీ ఎలా ఉందో ఓ సారి చూద్దాం. దేవికా నందన్ (రీతూ వర్మ) పల్లెటూరులో ఉంటుంది. తండ్రి మాటను జవదాటదు. బయటి ప్రపంచం ఎలా ఉంటుందో కూడా తెలీదు. ఎప్పుడూ సొంత ఊరిని వదిలి పెట్టి వెళ్లింది కూడా లేదు. అలాంటి దేవిక పెద్దలు కుదర్చిన సంబంధం చేసుకునేందుకు రెడీ అవుతుంది. అలా జగన్నాథం అలియాస్ జగ్గీ (సుబ్బరాజు)తో దేవిక నిశ్చితార్థం జరుగుతుంది. ఆ తరువాత ఆమె జీవితంలోకి డానీ (సూర్య వశిష్ట) అనే వ్యక్తి వస్తాడు. డానీ వచ్చాక దేవిక జీవితం ఎలా మారుతుంది? ఊరు దాటని దేవిక సిటీకి వచ్చి ఏం చేస్తుంది? అసలు ఆత్మ అయిన డానీ దేవికకు ఎందుకు కనిపిస్తాడు? దేవికతో డానీకి పడిన పని ఏంటి? చివరకు వీరి ప్రయాణం ఎలాంటి పరిస్థితులకు దారి తీస్తుంది? ఈ ప్రయాణంలో దేవికకు సాయం చేసే సుబ్బు (శివ కందుకూరి) పాత్ర ఏంటి? చివరకు ఏం జరుగుతుంది? అన్నదే కథ. దేవిక అండ్ డానీ వెబ్ సిరీస్ కోసం తీసుకున్న పాయింట్ చాలా పాతది. కాకపోతే ఇంతకు ముందు ఆ పాయింట్, కథతో వయలెంట్, హారర్ మూవీస్ వచ్చాయి. కానీ కంప్లీట్ క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌లు మాత్రం రాలేదు. దేవిక అండ్ డానీ మాత్రం ఆత్మలు అనే పాయింట్ వాడినా.. ఎక్కడా కూడా మితి మీరిన హింస, అసలు హింసే కనిపించదనుకోండి. అదే ఈ సిరీస్‌కు ఓ కొత్త పాయింట్ అనుకోవచ్చు. ఓటీటీ కంటెంట్ అయినా కూడా ఎక్కడా అశ్లీలత లేకుండా, డబుల్ మీనింగ్ డైలాగ్స్ లేకుండా ఉండటమే ఈ సిరీస్‌కు ప్లస్. దేవిక పాత్రను మల్చిన తీరు.. డానీ పాత్రకు పెట్టిన గతం.. ఇవేవీ కూడా కొత్తగా అనిపించవు. కానీ రీతూ వర్మ ప్రజెన్స్, అప్పియరెన్స్ వల్ల ఆ పాత్రకు వెయిటేజీ వచ్చినట్టు అనిపిస్తుంది. మామూలుగా ఇంత వరకు ఏ సినిమాలో, సిరీస్‌లో చూసినా కూడా దెయ్యాలకు విపరీతమైన శక్తులుంటాయి.. ఆత్మలు ఏమైనా చేసేయగలవు. కానీ ఈ సిరీస్‌లో మాత్రం ఓ ఆత్మకు ఎలాంటి శక్తులు ఉండవు.. ఏమీ చేయలేదు. దేవిక పాత్రను ఎలివేట్ చేయడానికి.. అమ్మాయి తల్చుకుంటే ఏదైనా చేయగలదు అని చెప్పడానికి ఇలా ఇందులో ఆత్మల్ని శక్తి విహీనులుగా చూపించారా? అన్నది అర్థం కాదు.ఆత్మలతో ప్రయాణం అనే కాన్సెప్ట్ ఇప్పటిది కాదన్న సంగతి తెలిసిందే. మన తెలుగులోనే చూసుకుంటే ఎందుకంటే ప్రేమంట, లారెన్స్ సినిమాలు ఇలా ఎన్నెన్నో కనిపిస్తాయి. దేవిక అండ్ డానీ వెబ్ సిరీస్‌లో ఎక్కడా అద్భుతమైన టర్నింగ్ పాయింట్లు, ఎంగేజింగ్ సీన్లు, అబ్బుర పరిచే ట్విస్టులు ఉండవు. కానీ ఓ కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్, కుటుంబం అంతా కలిసి చూడదగ్గ ఓ ఓటీటీ కంటెంట్‌గా మాత్రం దేవిక అండ్ డానీ నిలుస్తుంది. దేవిక అండ్ డానీ పార్ట్ 2 కోసం వదిలిన లీడ్స్ కూడా బాగుంటాయి. దేవికను చంపేందుకు ఓ గ్యాంగ్, పెళ్లి చేసుకోవాలని అనుకునే జగ్గీ, ఆమెను ప్రేమను పొందాలని చూసే సుబ్బు.. మళ్లీ డానీ వస్తాడా? లేదా? అన్న కన్ఫ్యూజన్.. అసలు ఈ ఆత్మలు దేవికకు ఎలా కనిపిస్తున్నాయనే ఆసక్తికరమైన పాయింట్.. ఇలాంటి ఇంట్రెస్టింగ్ ఆలోచనలు రేకెత్తించేలా పార్ట్ వన్ ఎండ్ చేసి పార్ట్ 2కి లీడ్ ఇచ్చారు. టెక్నికల్‌గా దేవిక అండ్ డానీ ఓకే అనిపిస్తుంది. విజువల్స్ సహజంగా ఉంటాయి. సెట్ వర్క్ కూడా పెద్దగా కనిపించదు. లెంగ్త్ కూడా వెబ్ సిరీస్‌కు తగ్గట్టుగా ఏడు పార్టులు.. మొత్తంగా మూడు గంటల నిడివితో చక్కగా కట్ చేశారు. మ్యూజిక్ చాలా ప్లెజంట్‌గా ఉంటుంది. ఉమెన్ ఎంపవర్మెంట్ గురించి అండర్ లైన్‌గా చెప్పిన కొన్ని మాటలు బాగుంటాయి.



## రాష్ట్రంలో ఉన్మాదులు, సైకోలకు తావులేదు..


అనంతపురం రామకృష్ణ కాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థిని తన్మయి హత్య ఘటన తనను తీవ్రంగా కలచి వేసిందని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. దుండగులు రాక్షస ప్రవృత్తితో మృతదేహాన్ని పెట్రోల్ పోసి తగులబెట్టడం తనను షాక్‌కు గురిచేసిందన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉన్మాదులు, సైకోలకు తావులేదని, ఇంటర్ విద్యార్థిని తన్మయి హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షిస్తామని మంత్రి స్పష్టం చేశారు. హత్యకు గురైన సోదరి కుటుంబానికి అన్నివిధాలా అండగా నిలుస్తామని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. కాగా అనంతపురం నగరానికి చెందిన ఇంటర్ విద్యార్థిని దారుణ హత్యకు గురైంది. స్థానిక రామకృష్ణ కాలనీకి చెందిన లక్ష్మీపతి కుమార్తె తన్మయి(19) నగరంలోని వివేకానంద కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదివింది. సెలవులు కావడంతో ఇంటి వద్దే ఉంటోంది. ఈ నెల 3వ తేదీ (మంగళవారం) రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. తల్లిదండ్రులు పరిసర ప్రాంతాల్లో గాలించినా జాడ తెలియలేదు. దీంతో మరుసటి రోజు (బుధవారం) వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## నేను మణిరత్నం గారికి అభిమానిని




బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్ 'సితారే జమీన్ పర్' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా మణిరత్నం గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. ఇంతకీ, అమీర్ ఖాన్ ఏం మాట్లాడాడు అంటే.. 'సౌత్ లో నాకు మణిరత్నం సినిమాలు అంటే ఎప్పటి నుంచో అభిమానం. నేను మణిరత్నం గారి సినిమాలకు అభిమానిని. చాలా సార్లు ఆయనతో కలిసి పనిచేయాలి అనుకున్నాను. చెన్నై వచ్చినప్పుడల్లా ఆయన్ను కలుస్తుంటాను. ఎన్నో సార్లు మేమిద్దరం కలిసి పనిచేయాలని అనుకున్నాం' అని అమీర్ తెలిపాడు. అమీర్ ఇంకా మాట్లాడుతూ.. 'మా ఇద్దరి కాంబోలో 'లజో' అనే మూవీ కూడా అనుకున్నాం. కానీ, అనుకోని కారణాలతో అది చేయలేకపోయాం. కానీ ఎన్నటికైనా మణిరత్నం గారితో మూవీ చేయాలని ఉంది.

## సునీల్ ద్విభాషాచిత్రం



ప్రముఖ దర్శకుడు, సినిమాటోగ్రాఫర్ విజయ్ మిల్టన్ దర్శకత్వంలో ఓ ద్విభాషా చిత్రం తెరకెక్కనున్నది. ఈ సినిమాలో నటుడు సునీల్ కీలక పాత్ర పోషించనున్నట్టు ఆదివారం మేకర్స్ ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. సునీల్‌లోని కొత్తకోణం ఆవిష్కృతమయ్యేలా ఈ పాత్ర ఉంటుందని, ఈ నెల 15న ఈ సినిమాకు సంబంధించిన అధికారిక టైటిల్‌ని ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు.

## మరో సంచలనం సృష్టించేందుకు సిద్ధమవుతున్న అంబానీ



ప్రస్తుతం స్మార్ట్ ఫోన్ ప్రపంచం కొనసాగుతోంది. రోజురోజుకు మార్కెట్లో సరికొత్త మొబైళ్లు అందుబాటులోకి వస్తున్నాయి. అత్యాధునిక ఫీచర్స్‌ను ఉపయోగించి బడ్జెట్ ధరల్లో విడుదల చేస్తున్నాయి మొబైల్ తయారీ కంపెనీలు. ఇప్పుడు రిలయన్స్ జియో మార్కెట్లో సంచలన సృష్టించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈసారి లక్ష్యం భారతదేశంలో స్మార్ట్‌ఫోన్ పరిశ్రమపైనే. 4G, 5G, ఫీచర్ ఫోన్ పరిశ్రమలో ముఖ్యాంశాలుగా నిలిచిన ముఖేష్ అంబానీ నేతృత్వంలోని కంపెనీ ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ విభాగంపై దృష్టి సారించింది. కంపెనీ గతంలో అనేక స్మార్ట్‌ఫోన్‌లను కూడా విడుదల చేసినప్పటికీ, జియో ఫోన్ 5G వార్తల్లో నిలుస్తోంది ఎందుకంటే ఇది సాధారణంగా రూ.30,000 లేదా అంతకంటే ఎక్కువ ధర ఉన్న ఫోన్‌లలో మాత్రమే కనిపించే ఫీచర్స్ కలిగి ఉంది. ఇది రూ. 2500 ధరల్లో అందుబాటులో ఉండవచ్చని తెలుస్తోంది.వస్తున్న లీకుల ప్రకారం.. జియో ఫోన్ 5Gలో 200-మెగాపిక్సెల్ వెనుక కెమెరా ఉండవచ్చని తెలుస్తోంది. ఇది చాలా హై-ఎండ్ ఫోన్‌లు మాత్రమే కలిగి ఉంటుంది. దీని అర్థం జియో ఫోన్ 5G మంచి నాణ్యతతో కూడిన ఫోటోలు తీయగలదని తెలుస్తోంది. దీనికి 32MP ఫ్రంట్ కెమెరా ఉంటుంది. ఇది ఈ రోజుల్లో చాలా మిడ్-రేంజ్ ఫోన్‌ల కంటే ఎక్కువ.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM





# అట్టహాసంగా అఖిల్-జైనబ్ వెడ్డింగ్ రిసెప్షన్

నాగార్జున రెండో తనయుడు అఖిల్ వివాహం జైనబ్‌తో జూన్ 6న ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. నాగార్జున నివాసంలో ప్రైవేట్ వేడుకగా వివాహం జరిగింది. ఈ వివాహ వేడుకకు ఇరు కుటుంబసభ్యులు, సన్నిహితులు, సినీతారలు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఇందుకు సంబంధించిన ఫోటోస్, వీడియో సోషల్ మీడియాలోతెగ హల్‌చల్ చేస్తున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా ప్రేమలో ఉన్న వీరిద్దరు పెద్దలని ఒప్పించి గతేడాది నవంబర్ లో నిశ్చితార్థం చేసుకున్నారు. ఇక జూన్ 6న వివాహం చేసుకోగా, జూన్ 8న అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఘనంగా అఖిల్, జైనబ్ ల వెడ్డింగ్ రిసెప్షన్ నిర్వహించారు.



















# డియర్ డాడీ రివ్యూ

మన తెలుగు స్ట్రీమింగ్ యాప్ ఈటీవీ విన్ వారు తీసుకొస్తున్న వీక్లీ సిరీస్ కథా సుధ నుంచి లేటెస్ట్ గా వచ్చిన ఎపిసోడ్ నే "డియర్ డాడీ". మరి ఈ ఎపిసోడ్ ఎలా ఉందో రివ్యూలో చూద్దాం రండి. ఇద్దరు భార్యాభర్తలు రవి (శశిధర్) చంద్రిక (శరణ్య ప్రదీప్)లు ప్రేమించి పెళ్లి చేసుకున్నాక వారికి విస్మయ (వైష్ణవి) పుడుతుంది. అయితే ఆమె చిన్నప్పుడు అంతా బాగానే ఉంటుంది. కానీ పెద్ద దర్శకుడు అయ్యి గొప్ప లైఫ్ ని కోరుకునే రవి విడాకులు తీసుకొని దర్శకత్వం పనుల్లో ఉంటాడు. అయితే 9 ఏళ్ల వయసులో కూతురు నుంచి విడిపోయాక తాను పెద్ద దర్శకుడు అయ్యి మళ్ళీ తనకి 18 ఏళ్ళు నిండాక తన కూతురుగా అందరికీ చెప్తానని అప్పుడు నుంచి తన దగ్గరే ఉండొచ్చని విస్మయాకి చెప్తాడు. ఇంతలో చంద్రిక అశోక్ (రవివర్మ) ని వివాహం చేసుకుంటుంది. మరి తన లైఫ్ లో వచ్చిన నాన్న కాని నాన్న పట్ల విస్మయ ఎలా ఉంది? 18 ఏళ్ళు నిండిన తర్వాత తన తండ్రి దగ్గరకి వెళ్ళాక ఏం జరిగింది? చివరికి ఏ నాన్న ప్రేమ ఆమెకి సొంతం అయ్యింది అనేది తెలియాలి అంటే ఈ లఘు చిత్రాన్ని చూసి తెలుసుకోవాలి. ఈ ఎపిసోడ్ లో ప్రధాన బలం నటీనటుల పెర్ఫామెన్స్ లతో పాటుగా నీట్ గా సాగే ఎమోషనల్ కథనం అని చెప్పవచ్చు. ఈటీవీ విన్ ఈ కథా సుధలో వచ్చిన అన్ని ఎపిసోడ్స్ కంటే ఇదే ఎక్కువ నిడివి కావచ్చు కానీ దాదాపు పెద్దగా బోర్ లేకుండానే సాగింది. మొదటి నుంచి చివరి వరకు కూడా డీసెంట్ ఎమోషన్స్ తో ఈ ఎపిసోడ్ ఫ్యామిలీ ఆడియెన్స్ కి కనెక్ట్ అవుతుంది. సీనియర్ నటులు రవి వర్మ మంచి రోల్ లో కనిపించాడు. తన రోల్ లోని డెప్త్ ని తాను ఎమోషనల్ బాగా క్యారీ చేసి చూపించారు. అలాగే నటుడు శశిధర్ కూడా సాలిడ్ పెర్ఫామెన్స్ ని చూపించారు. తన రోల్ లో లేయర్స్ ని పాజిటివ్ నుంచి నెగిటివ్ వరకు బాగా చేశారు.




ఇక ఫిదా ఫేమ్ నటి శరణ్య ప్రదీప్ తన మార్క్ నాచురల్ నటనతో ఆకట్టుకుంటారు. ఇక వీరితో పాటుగా కూతురి పాత్రలో నటించిన యువ నటులు వైష్ణవి సహస్ర శ్రీలు కూడా బాగా చేశారు. వీటితో పాటుగా ఎపిసోడ్ లో చివరి కొంతసేపు బాగా సాగుతుంది. దర్శకుడు అక్కడ రాసుకున్న కథనం ఒకింత హార్డ్ హిట్టింగ్ గానే తగులుతుంది. ఈ ఎపిసోడ్ లో మంచి ఎమోషన్స్ ఉన్నాయి. కానీ ఇది చాలా రొటీన్ లైన్ అని చెప్పాలి. చాలా వరకు కథనం ఒకింత ఊహించదగిన రీతిలోనే సాగుతుంది కాబట్టి పెద్దగా ట్విస్ట్ లు లాంటివి ఈ ఎమోషనల్ ట్రాక్ లో కనిపించవు. వీటితో పాటుగా మధ్యలో కొన్ని సీన్స్ అయితే మరీ రొటీన్ గా ఓల్డ్ డ్రమాటిక్ గా అనిపిస్తుంది. అమ్మ నాన్న ఓ తమిళమ్మాయి సినిమాలో ప్రకాష్ రాజ్ తన కల కోసం కుటుంబాన్ని వదిలేసి వెళ్ళడాన్నే ఇక్కడ కూడా తీసుకున్నారు. సో కొంచెం కొత్తదనాన్ని కోరుకునేవారు అయితే డిజప్పాయింట్ అవ్వక తప్పదు. ఇలాంటి వాటిలో కొంచెం కేర్ తీసుకోవాల్సింది. ఈ ఎపిసోడ్ లో నిర్మాణ విలువలు బాగున్నాయి. సంగీతం, సినిమాటోగ్రఫీ వంటివి కూడా బాగానే ఉన్నాయి కానీ డబ్బింగ్ ఇంకొంచెం నాచురల్ గా చేయాల్సింది. మెయిన్ గా చిన్న పాప డబ్బింగ్ చాలా తక్కువ క్వాలిటీలో అనిపిస్తుంది. ఇక దర్శకుడు శ్రీకాంత్ దేవరకొండ విషయానికి వస్తే తన నుంచి ఇది డీసెంట్ వర్క్ అని చెప్పొచ్చు కానీ ఇంకొంచెం బెటర్ గా కూడా ట్రై చేసి ఉంటే బాగుండేది. ఎమోషనల్ పార్ట్ వరకు తాను బాగా నడిపించారు. కానీ లైన్ లో ఇంకొన్ని సీన్స్ లో ఫ్రెష్ నెస్ లోపించింది. ఇది కూడా బాగుండి ఉంటే పిక్చర్ పర్ఫెక్ట్ గా ఉండేది. ఇవి మినహా తన వర్క్ మెప్పిస్తుంది. ఇక మొత్తంగా చూసినట్టు అయితే ఈ 'డియర్ డాడీ' లో ఎమోషనల్ పార్ట్ వర్కౌట్ అవుతుంది. కొన్ని సీన్స్ మినహాయిస్తే ఇందులో ఒక కూతురు, తండ్రికి నడుమ కనిపించే ప్రేమ, డ్రామా బాగున్నాయి. సొంత నాన్న స్థానంలో మరొకరిని ఎలా భర్తీ చేస్తారు అనే అంశాన్ని దర్శకుడు చక్కగా తీసుకెళ్లారు. కొన్ని నెగిటివ్స్ పక్కన పెడితే ఈ ఎపిసోడ్ ని కూడా ఈటీవీ విన్ కథా సుధలో ట్రై చేయవచ్చు.



# బికినీలో పీవీ సింధు

ఒలింపిక్ విజేత పీవీ సింధు ప్రస్తుతం ఫామ్ లేక ఇబ్బందిపడుతున్న విషయం తెలిసిందే. అప్పుడెప్పుడో 2022లో సింగపూర్ ఓపెన్‌లో గెలిచిన ఈ అమ్మడు ఆ తర్వాత ఏ మేజర్ టోర్నీలో విజేతగా నిలవలేదు. రీసెంట్‌గా జరిగిన మలేషియా మాస్టర్స్‌లో తొలి రౌండ్‌లోనే వెనుదిరిగిన భారత షట్లర్.. ఇండోనేషియా ఓపెన్‌లోనూ ఉసూరుమనిపించింది. గెలవాల్సిన మ్యాచ్‌లో పట్టుకోల్పోయి రెండో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. ఇదిలావుంటే పీవీ ఆటకు దూరంగా ఉండి పర్సనల్ టైం గడపడానికి తన భర్తతో కలిసి వెకేషన్‌కి చెక్కేసింది. వియత్నంలోని అమనోయిలో తన భర్తతో కలిసి వెకేషన్ ఎంజాయ్ చేస్తుంది ఈ అమ్మడు. అయితే తాజాగా ఈ బ్యాడ్మింటన్ స్టార్ బికినీలో మెరిసింది. తాజాగా ఈ ఫొటోలను సోషల్ మీడియా వేదికగా పంచుకుంది.

# రాజకీయాల కోసం రాష్ట్ర నీటి హక్కులను కాలరాయొద్దు

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తున్నదని, రాజకీయాల కోసం రాష్ట్ర నీటి హక్కులను కాలరాయొద్దని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ప్రభుత్వం విద్వేషంతో ఆలోచన చేయకూడదని తెలిపారు. తమకు న్యాయం మీద నమ్మకం ఉన్నదని, అంతిమంగా న్యాయం గెలుస్తుందని చెప్పారు. కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరయ్యే ముందు హైదరాబాద్ కోకాపేట్‌లోని తన నివాసం వద్ద హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. 'మొన్ననే కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు కల్పతరువు అని స్పష్టంగా రాష్ట్ర ప్రజలందరికీ అర్థమయ్యే విధంగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చాం. రాజకీయ దురుద్దేశంతో కాంగ్రెస్ పార్టీ కమిషన్ ఏర్పాటుచేసినా, న్యాయ వ్యవస్థ మీద, రాజ్యాంగం మీద పూర్తి గౌరవం, విశ్వాసం ఉన్న పార్టీ బీఆర్‌ఎస్. ఈరోజు జస్టిస్ ఘోష్ కమిషన్ ముందుకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారాలు వివరించి, అసలు వాస్తవాలను తెలియజేస్తాం. మా దగ్గర ఉన్నటువంటి పూర్తి సమాచారం, అన్ని విషయాలను కమిషన్ దృష్టికి తీసుకెళ్తా. గత కొంతకాలంగా కొంతమంది వ్యక్తులు, కొన్ని పార్టీలు ఉద్దేశపూర్వకంగా బీఆర్‌ఎస్ మీద రాజకీయ కక్షతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. వాస్తవానికి ఒక ప్రభుత్వం ఆలోచించవలసింది ఉద్దేశంతో కాదు, విజ్ఞతతో ఆలోచించాలి. రాజకీయ దుర్దేశంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రానికి, రైతులకు అన్యాయం చేస్తుంది. విజ్ఞత ప్రదర్శించండి, వివేకంతో ఆలోచించండి. ఈ రాజకీయాల కోసం తెలంగాణ రాష్ట్ర నీటి హక్కులను కాలరాయద్దు.

